పింఛన్లు కట్ కట్..!

- ప్రత్యేక అధికారులతో పింఛన్లపై విచారణ
- వైకల్య నిర్ధారణపై మళ్లీ పరీక్షలు
- సగం మంది లబ్ధిదారులకు పింఛన్లు ఔట్


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పలమనేరు: పింఛన్లను పెంచి వృద్ధులు, దివ్యాంగులు, వింతంతులు, అనారోగ్యులను ఏమార్చి గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వంతో ఇప్పుడు లబ్ధిదారులకు మొదటికే మోసం అయ్యింది. గత ప్రభుత్వంలో దివ్యాంగ పింఛన్లు పొందిన వారిలో అనర్హులను ఏరివేసేందుకు ఇప్పుడు ప్రత్యేక వైద్య బృందాలతో ఏరియా ఆస్పత్రుల్లో విచారణ చేపడుతోంది. ఆమేరకు పలమనేరు ఏరియా ఆస్పత్రిలో సోమ, మంగళ, బుధవారాల్లో కంటి వైద్యులు అందుకు సంబంధించిన వికలాంగుల శాతాన్ని మరో దఫా పరిశీలించి నిజంగా వారికి వైకల్యం ఉందా లేదా అని విచారణ గత పది రోజులుగా ఇక్కడ సాగుతోంది. ఇప్పటిదాకా ఇక్కడ జరిగిన పరీక్షల్లో సగానికిపైగా కంటికి సంబంధించిన వికలాంగులు అనర్హులుగా మారినట్టు తెలిసింది. ఇక ఇతర వైకల్యంపై పరీక్షలు నిర్వహించేందుకు త్వరలో సంబంధిత వైద్యులు ఇక్కడికి రానున్నారు. ఇలాఉండగా మంచానికే పరిమితమైన రోగులకు సంబంధించి 90శాతం మంది అనర్హులుగా ఉన్నట్టు కూటమి ప్రభుత్వానికి సమాచారం ఉందని తెలిసింది. దీంతో నెలకు రూ.15 వేల అనారోగ్య పింఛన్ పొందే లబ్ధిదారుల్లో 90శాతం మందికి ఇక పింఛన్లు లేనట్టే.

సగానికిపైగా వైకల్య పింఛన్లు అనుమానమే...

నియోజకర్గంలో 38వేల దాకా అన్నిరకాల సామాజిక పింఛన్లు ఉన్నాయి. వీటిలో 12వేల దాకా దివ్యాంగుల, అనారోగ్య (డయాలసిస్ లాంటివి) ఉన్నాయి. వీటిలో అంధత్వానికి సంబంధించి 1,650 పింఛన్లు ఉన్నాయి. వీటిపై స్థానిక ఏరియా ఆస్పత్రిలో సాగుతున్న విచారణలో ఇప్పటిదాకా 550 మందికి పరీక్షలు చేశారు. కాగా వీటిలో 300 మంది అనర్హులుగా తేలినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన అనర్హుల వివరాలను ఇక్కడి వైద్యులు బయటికి చెప్పడం లేదు. ఆ లెక్కన ఇతర దివ్యాంగుల వైకల్య పరీక్షలను నిర్వహించి అనర్హుల జాబితా వస్తే సగానికిపైగా దివ్యాంగులకు వచ్చే నెల పింఛన్లు అందని పరిస్థితి కనిపిస్తోంది. ఇదే పరిస్థితి వింతంతు, ఒంటరి మహిళలు, వృద్ధాప్య పింఛన్లలోనూ తలెత్తే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయమై స్థానిక ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డా.శారదను వివరణ కోరగా గత పది రోజుల నుంచి కంటికి సంబంధించిన దివ్యాంగులకు సదరం ద్వారా ప్రత్యేక వైద్యులు మరో దఫా పరీక్షలను నిర్వహిస్తున్న మాట వాస్తవమేనన్నారు. ఈ మార్చి దాకా పింఛన్‌దారులపై విచారణ సాగుతుందని తెలిపారు. అయితే ఈ పరీక్షలో అనర్హులుగా మారిన వివరాలు తమకు తెలీదని ఇవన్నీ ఉన్నతాధికారులకు పంపుతున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరులో ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. కల్లూరులోని దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎరువులనే అమ్మాలని, బస్తాపై ఉన్న ఎంఆర్‌పీ ధరకే రైతులకు విక్రయించి బిల్లు ఇవ్వాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకురాలు నాగపద్మిని, చిత్తూరు రైతు శిక్షణ అధికారిణి ప్రసన్నలక్ష్మి, మండల వ్యవసాయ శాఖాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

విస్తరణ పనులు పూర్తి చేద్దాం


విస్తరణ పనులను పరిశీలిస్తున్న కడా పీడీ

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలో అర్ధాంతరంగా ఆగిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. గురువారం పట్టణంలో రోడ్డు విస్తరణ రిచ్-2, రిచ్-3 పనులను ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో రిచ్-2, రిచ్-3 పనులతో పాటు రింగు రోడ్డు పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. మొదటి విడతగా పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వేగేటు నుంచి బస్టాండు, అనంతరం బస్టాండు నుంచి ఎంఆర్ రెడ్డి సర్కిల్ వరకు ఆగిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు


సదుం: రిజిస్టర్ తనిఖీ చేస్తున్న అధికారులు

సదుం: ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని జిల్లావనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిని దుకాణదారులను హెచ్చరించారు. ఏఓ లక్ష్మీప్రసన్నతో కలసి ఆమె గురువారం మండల కేంద్రంలో ఎరువులు, పురుగుల మందు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. నాణ్యత కలిగిన విత్తనాలు, పురుగుల మందులు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. సదుం-2 రైతు సేవాకేంద్రంలో ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఏఓ మాధవి పాల్గొన్నారు.

టీఎన్ కుప్పంలో మలేరియా అధికారుల సందర్శన

బైరెడ్డిపల్లి: మండలంలోని టీఎన్ కుప్పంలో జిల్లా మలేరియా అధికారులు సందర్శించి దోమల విజృంభణ, లార్వాకు సంబంధించిన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తీర్థం పీహెచ్‌సీలో కుష్ఠువ్యాధి నివారణపై వైద్యాధికారి అరుణ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్, శిరీష, వైద్యాధికారులు విజయ్‌చంద్ర, సీహెచ్‌ఓ అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి


బహుమతులు అందిస్తున్న ఏఎస్‌ఐ

సదుం: విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరివర్తన సేవా సంస్థ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, టెన్నిస్, రన్నింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. దొరస్వామి, జీవీఎస్ బాబు, సేవా సంస్థ అధ్యక్షుడు అమర్నాథ్, జగదీష్, లెక్చరర్లు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: మండలంలోని వనమలదిన్నె వద్ద గల కోళ్లఫారాల్లో పనిచేస్తున్న ఓ వివాహిత కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. వివరాలిలా.. బిహార్ రాష్ట్రానికి చెందిన బుక్కీ రామ్, భార్య ప్రియాంక (30) కలిసి కోళ్లఫారాలలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో దంపతులు ఇరువురు గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రియాంక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే భర్త, స్థానికులు కలసి ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కలిసి పనిచేయాలి


మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ వెంకటరమణ

రొంపిచెర్ల: స్థానిక కేజీబీవీలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, ఎస్‌ఓ సుజాత కలసి పని చేయాలని ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. ఆయన రొంపిచెర్ల కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కేజీబీవీలో ఎంఈఓలు రహస్య విచారణ చేశారని తెలిపారు. విచారణలో ఎస్‌ఓ పనితీరు బాగా లేదని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల పని తీరు బాగా లేదని ఎస్‌ఓ ఒకరిపై ఒక్కరు ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై అందరు కలసి పనిచేయాలని ఆదేశించారు. పనిచేయకుంటే అందరిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీసీడీఓ, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, సీఆర్‌పీలు అనసూయ, కిరణ్, రాజేంద్ర పాల్గొన్నారు.

బోర్లు కుంగుతున్నాయి మహాప్రభో!


దీక్షలో రైతులు

కుప్పంరూరల్: ఆవులనత్తం వద్ద నిర్వహిస్తున్న జెల్లి ఫ్యాక్టరీ వల్ల తమ వ్యవసాయ బోర్లు భూమిలోకి కుంగిపోతున్నాయని స్థానిక రైతులు నిరసన చేపడుతున్నారు. ఆందోళనకారులు మాట్లాడుతూ నిరసన చేపట్టి నేటికి 23 రోజులు అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. ప్రస్తుతం వ్యవసాయ బోరు పైపులు భూమిలోకి కుంగిపోతున్నాయని, ఇంటి గోడలకు పగుళ్లు వస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

నెట్టిబండను సందర్శించిన జేసీ


యానాదిపాళెంలో సమస్యలను వింటున్న జేసీ విద్యాధరి

- ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు

చౌడేపల్లె: మండలంలోని దిగువ పల్లె పంచాయతీ నెట్టిబండను జాయింట్ కలెక్టర్ విద్యాధరి గురువారం సందర్శించారు. సాక్షి దిన పత్రికలో నెట్టిబండలో ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై గతంలో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు గ్రామాన్ని సందర్శించి అప్పట్లోనే బర్త్, ఆధార్ కార్డులతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించారు. గురువారం ఎస్టీలతో మాట్లాడి వారి సమస్యలపై మారోమారు జేసీ ఆరా తీశారు. రేషన్ కార్డులు, పక్కాగృహాలతో పాటు మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వెంగళపల్లె పంచాయతీ పరిధిలోని యానాదిపాళెంను సందర్శించారు. అక్కడ ఎస్టీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంగళపల్లె నుంచి యానాదిపాళెంకు రోడ్డు , విద్యుత్ సౌకర్యం కల్పించాలని జేసీ దృష్టికి తెచ్చారు. వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ హనుమంతు నాయక్ ఉన్నారు.

పెద్దిరెడ్డిపై ఆరోపణలు తగవు

పులిచెర్ల(కల్లూరు): అటవీ భూములను కబ్జా చేశారని ఎల్లో మీడియాలో వచ్చిన కథనం పూర్తిగా అవాస్తవమని మతుకువారిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు ఉష ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇదే అంశంపై గతంలో ఉన్న ప్రభుత్వాలు విచారణ జరిపి జాయింట్ సర్వే నిర్వహించి, ఇవి ప్రైవేటు భూములని నిర్ధారించినా కూటమి ప్రభుత్వం ప్రజలను పక్కదోవ పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. ఇది ముమ్మాటికీ అసత్య ఆరోపణ మాత్రమేనని తెలిపారు.

కమనీయం.. కోనేటిరాయుని కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవర్లపై తలంబ్రాలు కురిపించి మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. తరువాత గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అడుగడుగునా టెంకాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్షదీక్షితులు పాల్గొన్నారు.

టీకాలు వేసినా నివారణ శూన్యం

గుడుపల్లె: లంపి స్కిన్ వ్యాధికి టీకాలు వేసినా వ్యాధి నయం కాదని పశువైద్యాధికారి ఆమని ఉన్నాతాధికారులకు నివేదిక పంపారు. గురువారం సాక్షి దినపత్రికలో 'లంపి స్కిన్ మహమ్మారి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు వివరణగా పశువైద్యాధికారి ఆమని స్పందిస్తూ లంపి స్కిన్ వైరస్ ద్వారా వచ్చే వ్యాధి అని దీనికి టీకాలు వేసినా నివారించేందుకు సాధ్యం కాదన్నారు. ఎక్కువగా ఈ వ్యాధి దూడలకు మాత్రమే వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి యాజమాన్య లోపాల కారణంగా విస్తరిస్తూ మరణాలు సంభవిస్తున్నాయన్నారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి చేద్దాం


చెరుకువారిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


రాయలపేటలో ర్యాలీ


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.జానకిరావు తెలిపారు. గురువారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవ సందర్భంగా సిబ్బందితో కలిసి కల్లూరులో ర్యాలీ నిర్వహించారు.


రొంపిచెర్లలో ర్యాలీ

కుష్ఠు నిర్మూలనపై అవగాహన ర్యాలీ

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో గురువారం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి నందిని మాట్లాడుతూ విద్యార్థులు దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండి, గ్రామీణుల్లో చైతన్యం తేవాలని సూచించారు. సూపర్ వైజర్లు గీతాంజలి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనపై ర్యాలీ

సదుం: జాతీయ లెప్రసీ దినోత్సవం పురస్కరించుకుని చెరుకువారిపల్లె పీహెచ్‌సీలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ గిరీష, సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక పీహెచ్‌సీలో జాతీయ లెప్రసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుష్ఠు నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్, డాక్టర్ వినయ్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

ఫీజుల వేధింపులపై ఫిర్యాదు

పలమనేరు: పట్టణంలోని పలు ప్రయివేటు పాఠశాలల్లో ఆయా యాజమాన్యాలు ఫీజులు చెల్లించకుంటే పరీక్షలకు అనుమతించమని, ఫీజు కట్టని వారిని బడి బయట ఎండలో నిలబెడుతున్నారని పట్టణానికి చెందిన హ్యూమన్ రైట్స్ సంస్థ నిర్వాహకులు ముబారక్ గురువారం స్థానిక ఎంఈఓ లీలారాణికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎక్కడైనా యాజమాన్యం నుంచి ఇబ్బందులుంటే తమకు ఫిర్యాదు చేస్తే ఆ స్కూల్ యాజమాన్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

పచ్చదనాన్ని పెంపొందిద్దాం


విద్యార్థులతో వెంకటసిద్ధులు

పులిచెర్ల(కల్లూరు): పాఠశాల ఆవరణలో మొక్కలు విరివిగా నాటి పచ్చదనాన్ని పెంపొందిద్దామని నేషనల్ గ్రీన్‌కోర్ మాస్టర్ వెంకటసిద్ధులు తెలిపారు. కల్లూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. జెడ్పీటీసీ మురళీధర్, సర్పంచ్ షుకూర్, ఎస్ఎంసీ చైర్మన్ అస్రూఫ్, హెచ్ఎం శ్రీవాణి, రాజేంద్ర పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజీతో కలసి పరిశీలించారు. చలమంగళం కేంద్రంలో చిన్నారులకు కల్పిస్తున్న వసతుల గురించి ఎంపీపీ ఆరా తీశారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ, పంచాయతీల విస్తరణాధికారి శారదాదేవి తనిఖీ చేశారు. అనంతరం నేలపల్లి, కొలత్తూరు, నడింపల్లి, గౌదమాకులపల్లి, పెద్దకాప్పల్లి, నగిరేపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గృహనిర్మాణ శాఖ సిబ్బంది మల్లికార్జున పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పశువును పరిశీలిస్తున్న ఏడీ సుజాత

పెద్దపంజాణి: ఉచిత పశు వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు పశుసంవర్థక శాఖ ఏడీ సుజాత అన్నారు. గురువారం మండలంలోని పెద్దవెలగటూరు, బసవరాజుకండ్రిగ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పశువులకు బీమా చేసుకోవాలన్నారు. శిబిరాల్లో 450 పశువులకు పిడుదల మందులు, 150 పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పశువైద్యాధికారులు సరిత, వినిత కుమారి పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

గుడుపల్లె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శీతారాం అన్నారు. గురువారం మండలంలోని పెద్దకొటమాకనపల్లెలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని అన్ని శాఖల అధికారులతో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు అందించే సంక్షేమ పథకాలను అందరికి తెలియజేయాలని కోరారు. ఉపాధి హామీ ఏపీఓ ధనయ్య, ఏపీఎం గ్రీటా, అధికారులు పాల్గొన్నారు.

బాపూజీ ఆశయాలను ఆచరిద్దాం


పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో నివాళి


పెద్దపంజాణిలో నివాళి


బోడిపాటివారిపల్లెలో విద్యార్థుల నివాళి


చౌడేపల్లెలో నివాళి


గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో..


కుప్పంలో..

పలమనేరు: మహాత్మగాంధీ ఆశయాలను ఆచరించడమే మనం ఆయనికిచ్చే అసలైన నివాళి అని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆమేరకు స్థానిక కార్యాలయంలో గురువారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. అనంతరం మున్సిపాలిటీలోని 113మంది పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, పాదరక్షలు, టవళ్లు, సబ్బులు, ఆయిల్ ఆయన పంపిణీ చేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతిపితకు నివాళి

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతిపిత గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజీ, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి, ఏపీఓ మురుగేషన్ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: బోడిపాటివారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గాంధీ విగ్రహానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: వాసవీ వనిత క్లబ్‌ల ఇంటర్నేషన్ డైరెక్టర్ ఇస్సా నాగలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ వీధిలోని బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ సేవకులు రంగనాథ్‌బాబు, రామ్‌కుమార్, వాసవి, వనిత క్లబ్ అధ్యక్షులు శ్రీనాథ్, రంగవల్లి, కార్యదర్శులు నాగలక్ష్మి, కోశాధికారులు వాణి, అమరనాథ్ పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం మహేష్ నారాయణ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పంరూరల్: స్థానిక బీసీఎన్ విద్యా సంస్థలో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ బీసీ నాగరాజు, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు భాస్కరన్, కోదండరామయ్య, మాధవన్, గంగాధరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.